క్లుప్తంగా

పరిహారం ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఎర్రగుంట్ల మండల పరిధిలోని జువారి సిమెంట్ యాజమాన్యం నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ వల్ల వలసపల్లె గ్రామ దళితుల ఇళ్లు దెబ్బతిన్నాయని, వారికి పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ కోరారు. సోమవారం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వలసపల్లె దళిత కాలనీకి కేవలం 500 మీటర్ల లోపే బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ సమయంలో రాళ్లు కాలనీలోకి వచ్చి పడుతున్నాయన్నారు. తాగునీటి బోర్లు ఎండిపోయాయన్నారు. దీంతో గ్రామంలో పూర్తిగా నీటి ఎద్దడి ఏర్పడడంతో ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. జువారి యాజమాన్యమే ఆ గ్రామానికి శాశ్వత తాగునీటి పైపులైను ఏర్పాటు చేయాలని కోరారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల ఏపీ కార్ల్‌లో అకారణంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. ఏపీకార్ల్‌లో పనిచేస్తున్న 25 మందిని తొలగించిన సీఈఓ శ్రీనివాస ప్రసాద్ రావుపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఉదయ్, రైతు సంఘం నాయకుడు దస్తగిరిరెడ్డి, పవన్, ఏపీ కార్ల్ నాయకులు హరి, స్టీఫెన్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు. దీనిపై జేసీ స్పందిస్తూ బుధవారం సీఈఓను పిలిపించి మాట్లాడతానన్నారు.

కారుణ్య నియామకం

కడప అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎస్.రఘు వర్మ (హెచ్ జి 486) సతీమణి కె. విజయ మేరికి కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియామక పత్రాన్ని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీశైల రెడ్డి పాల్గొన్నారు.


అన్నదానం



స్నేహాలయ నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదానం చేస్తున్న హిమవర్షిణి ఫౌండేషన్ సభ్యులు

కడప అర్బన్ : కడప నగరంలోని హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కో–ఆపరేటివ్ వాస్తవ్యులు మెంట రామలక్షుమ్మ జయంతి సందర్భంగా ఆమె కుమార్తెలు, కుమారుడు ఎల్ఐసీ క్వార్టర్స్ దగ్గరున్న స్నేహాలయ నిరాశ్రయుల నివాస వసతిగృహం, జెడ్పీ దగ్గరున్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదాన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, వెంకట సురేష్ బాబు, దామోదర్, ఎలక్ట్రీషన్ మధు, గుండ్లకొండ శ్రీ చరణ్, స్నేహాలయ ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి



అంజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రైతు ఉద్యమ నేత అతుల్ కుమార్ అంజన్ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో అతుల్ కుమార్ అంజన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం వి సుబ్బారెడ్డి, పి భాస్కర్, సీపీఐ నగర కార్యదర్శి ఎన్ వెంకటశివ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి వేణుగోపాల్, ఎల్ నాగసుబ్బారెడ్డి, కేసి బాదుల్లా, విజయలక్ష్మి, మునయ్య, సుభాషిణి, పిప్రభాకర్, తేజ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ' గుర్తింపు రద్దు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల కోసం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్న నారాయణ స్కూలు గుర్తింపు రద్దు చేయడంతోపాటు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేశు యాదవ్ కోరారు. సోమవారం జెడ్పీ సీఈఓ ఓబులమ్మకు వినతిపత్రాన్ని సమర్పించారు. కమలాపురం మండలం పెద్దచెప్పలి రోడ్డులోని కొండాయపల్లెలో ఎంపీపీ పాఠశాల ఎదురుగా నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూలుకు విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతించారో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాయి, ఉపాధ్యక్షుడు శివ, నాయకులు నాగ, వంశీ, సన్ని, రాము, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించవద్దు

- మాసాపేటలో ఆలయ నిర్మాణ పనులు ఆపేయండి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ సురేష్ బాబు ఆదేశం
- పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా మారిందని అసహనం
- 60 ఏళ్లు పూర్తయిన కార్మికులను అదనపు కార్మికులుగా తీసుకునేలా తీర్మాణం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ మాసాపేటలో ఆలయ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని, సదరు కాంట్రాక్టర్‌కు ఎలాంటి బిల్లులు చెల్లించవద్దని నగర మేయర్ కె. సురేష్ బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి డబ్బులు ఖర్చుపెడుతూ ప్రథమ పౌరుడినైన తనను, స్థానిక కార్పొరేటర్లను ఆహ్వానించకుండా ఓడిపోయిన వారితో ఆలయ పనులకు శంకుస్థాపన చేయడంపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించవద్దని ఆదేశించారు.

■ టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి ఎక్కువైపోయింది.. అప్సర థియేటర్ ఎదురుగా నిర్మిస్తున్న ఓ భవన యజమానిని రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్రాసు రోడ్డులో ప్రియా ఐస్‌క్రీం పార్లర్ పక్కన టీడీపీ నేత రూ.5లక్షలు డిమాండ్ చేస్తున్నాడని స్థానిక వ్యాపారి సోషల్ మీడియాలో వీడియో అప్‌లోడ్ చేశాడు. దీనంతటికీ కారణం ఎవరు...ఏసీపీ మునిరత్నంపై ఫిర్యాదులు, ఆరోపణలు ఎక్కువైపోతున్నాయి.. అతన్ని వెంటనే ప్రభుత్వానికి సరెండర్ చేయండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా మారిందని, ఎక్కడా చూసినా చెత్తాచెదారం కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. 60 ఏళ్లు నిండిన 27 మంది మున్సిపల్ కార్మికులను అదనపు కార్మికులుగా కొనసాగించాలని తీర్మాణించారు. వార్డు సచివాలయాల్లో ఆ డివిజన్ కార్పొరేటర్లు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఛాంబర్ లేదా గదిని కేటాయించాలని సూచించారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఏ పార్టీ వారైనా గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు. దీనిపై కమిషనర్ మనోజ్‌రెడ్డి స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

షరతులతో ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి..

నగరంలోని మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన వారాహి విజయభేరి ఫన్‌ఫేర్ ఎగ్జిబిషన్ నిర్వహణకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు. ఏడు రోజుల్లోపు వేలం పాట మొత్తం రూ.30.05లక్షలు, సెక్యురిటీ డిపాజిట్ రూ.5లక్షలు చెల్లించిన తర్వాతే వర్క్ ఆర్డర్ ఇవ్వాలని ఆదేశించారు.

■ మద్రాసు రోడ్డులోని టవర్ క్లాక్ లీజు కాలాన్ని పొడిగించడం, నగరపాలక సంస్థ టీబీ కాంప్లెక్స్‌లోని 20 షాపురూములు, వైఎస్సార్ కాంప్లెక్స్‌లోని 19 షాపు రూముల లీజు కాలం పొడిగించే విషయంపై కమిటీ వేసి, ఆ నివేదిక ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని తీర్మాణించారు. చికెన్ వ్యర్థాలను తరలించేందుకు ఆహ్వానించిన టెండర్లను నిలుపుదల చేయాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆర్. బాలస్వామిరెడ్డి కోరారు.

■ ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు మగ్బూల్‌బాషా, కె. బాబు, ఆరీఫుల్లా బాషా, వాణి, ఆర్. బాలస్వామిరెడ్డి, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, సీపీ రమణ, ఆర్ఓలు విజయ్‌భాస్కర్‌గౌడ్, కన్నయ్య పాల్గొన్నారు.

శాస్త్రీయ దృష్టి కోణం కలిగిఉండాలి



మాట్లాడుతున్న సమీర్ బాష

కడప కల్చరల్ / కడప ఎడ్యుకేషన్ : ప్రతి పౌరుడు శాస్త్రీయ దృష్టి కోణం కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమీర్ బాష, బాలబయన్న పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో కడప నగరంలోని ద్వారకానగర్‌లో ఉన్న జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక కార్యకర్తల కోసం స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో చైతన్యం తీసుకొని రావాలంటే అంధ విశ్వాసాలను ప్రశ్నించే ధైర్యం ఉండాలని పేర్కొన్నారు. జేవీవీ సీనియర్ నాయకులు కుమారస్వామి, వెంకటేశ్వర్లు మాట్లాడారు. తరువాత పాటల ద్వారా, మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా మూఢనమ్మకాలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సమతా నాయకులు సునీత, అరుణ, కామేశ్వరమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరామరాజు, నగర ఉపాధ్యక్షులు రాయల్ కరిముల్లా, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, కుమారస్వామి సభ్యులు నరసింహారెడ్డి, గోపీనాథ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అది వారసత్వంగా వచ్చిన భూమి

కడప సెవెన్‌రోడ్స్ : పాత కడప చెరువు భూమిని ఆక్రమించారంటూ ఇటీవల వచ్చిన వార్తల్లో నిజం లేదని కడప నగరానికి చెందిన లీలావతి అనే మహిళ స్పష్టం చేశారు. సోమవారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వేనెంబర్లు 440–ఏ7, 440–బీ7 లోని ఎకరా 54 సెంట్ల భూమి తమకు వారసత్వంగా సక్రమించిందన్నారు. ఆ భూమి తమ అత్తగారి పేరిట ఉందని..అన్ని రెవెన్యూ రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. నూరాలజీ డాక్టర్ అయిన తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడడంతో తాను ఇంటికే పరిమితం అయ్యానన్నారు. ఆ భూమిలో కంప చెట్లు మొలవకుండా యేటా శుభ్రం చేయిస్తుంటానని.. ఈ యేడు కూడా కంపచెట్లను తొలగించామన్నారు. తనకు ఎలాంటి రాజకీయాలతో, ఏ నాయకులతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

చెత్తాచెదారం తొలగింపు



చెత్తాచెదారాలు తొలగించిన తర్వాత శుభ్రంగా కనిపిస్తున్న ఆర్టీసీ బస్టాండులోని హాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండు మెయిన్ గేటు వద్ద గల హాలును అధికారులు శుభ్రపరిచారు. ఈనెల 3వ తేదీన ఆర్టీసీ అధికారులూ.. ఇటు చూడరా అనే శీర్షికన బస్టాండులో అపరిశుభ్రత నెలకొన్న విషయంపై సాక్షి వార్త ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన అధికారులు భవనం పెచ్చులు, చెత్తాచెదారాన్ని ఇక్కడినుంచి తరలించారు. దుర్వాసన వెదజల్లే ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయడంపై స్థానిక వ్యాపారులతోపాటు ప్రయాణీకులు సాక్షికి ధన్యవాదాలు తెలియజేశారు.

పాత పెన్షన్ స్కీం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని 2003 డీఎస్సీ ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జుల తిరుపాల్ డిమాండ్ చేశారు. కడప ఎర్రముక్కపల్లిలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 2021వ సంవత్సరంలో జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డిసెంబర్ 22వ తేదీకి ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం వర్తింప చేయుటకు అవకాశం ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం ఈ జీవోను కేవలం ముగ్గురు ఐఏఎస్ అధికారులకు మాత్రమే వర్తింప చేసిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు ఉదయ భాస్కర్, వీర ప్రతాప్, అయ్యవారరెడ్డి, గంగాధర్, నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాంగ్ మార్చ్ చారిత్రాత్మకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం, మైనార్టీ నాయకులు

కడప కార్పొరేషన్ : వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కడప నగరంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన లాంగ్ మార్చ్ చరిత్రలో నిలిచిపోతుందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు షఫీ, బీహెచ్ ఇలియాస్, ఎస్ఏ షంషీర్ అన్నారు. సోమవారం స్థానిక మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లాంగ్ మార్చ్‌కు జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలతో పాటు హిందువులు, క్రిష్టియన్లు, వివిధ పార్టీల నేతలు స్వచ్ఛందంగా మద్దతు పలికారన్నారు. ముస్లింలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో ఖండించారని వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. లాంగ్ మార్చ్‌లో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ముస్లిం మత గురువులు, చర్చి ఫాదర్లు, ప్రజా సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరిముల్లా, డిష్ జిలాన్, రఫీ, అక్బర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 77 రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు గుదిబండలా మారిన జీఓ నంబర్ 77ను రద్దు చేసి, ఆ తర్వాతే ఈ ఏడాది ఐసెట్ ను నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యాసమితి సభ్యులు హనీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం యోగివేమన యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలోకి వస్తానే విద్యార్థులకు గుదిబండలా ఉన్న జీఓ నంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. సమావేశంలో యూనివర్సిటీ ఉపాధ్యక్షులు పుల్లయ్య, అరుణ్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో సోమవారం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి తేజ పేర్కొన్నారు. ఈ మేరకు నారాయణ కళాశాల ఎదుట నిరసన తెలిపి తరగతులను బహిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డు వేసవి సెలవులు ప్రకటించి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వాటిని ఖాతర్ చేయకుండా నారాయణ, శ్రీ చైతన్య పలు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు సెలవు దినాల్లో కూడా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు అభిరానందన్, నగర సహాయ కార్యదర్శులు చంద్ర, అరుణ్, నగర ఉపాధ్యక్షులు అశోక్, మల్లికార్జున, నిఖిల్, నగర కోశాధికారి రాజేష్, నాయకులు సాగర్, తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే డీఎస్సీ పరీక్షకు స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియామకాల్లో స్పోర్ట్స్ కోటాకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించడం సంతోషకర విషయన్నారు. అయితే స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు కూడా టెట్ అర్హత సాధించాలనే నిబంధన పెట్టారన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడలు ఆడిన క్రీడాకారుడు నిత్యం క్రీడలకే ఎక్కువ సమయం కేటాయించే క్రమంలో టెట్‌లో అర్హత సాధించే అవకాశాలు స్వల్పంగా ఉంటాయన్నారు. అందువల్ల టెట్ నిబంధనలను తొలగించాలని కోరారు.


రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలి



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ ఆఫీసర్లు

కడప ఎడ్యుకేషన్ : యువత రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్య నారాయణ మూర్తి పేర్కొన్నారు. సోమవారం కడప నగర శివార్లలోని తెలుగు గంగ కాలనీలోని 30 ఆంధ్రా బెటాలియన్‌లో నిర్వహిస్తున్న ఎన్.సి.సి కంబైండ్ ఆన్యువల్ శిక్షణ శిబిరంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆఫీసర్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జే. ఆత్రే, ఎన్.సి.సి అధికారులు కెప్టెన్ డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్ పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జిత్ సింగ్, సీ.ఎల్. రెడ్డి, కొండా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి నిస్సీ ఆశీర్వాద పండగ



పోస్టర్లు విడుదల చేస్తున్న పాస్టర్లు

కమలాపురం: మండల కేంద్రంలో ఈ నెల 12వతేదీ నుంచి నిస్సీ ఆశీర్వాద పండుగ నిర్వహిస్తున్నట్లు పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్ తెలిపారు. స్థానిక నిస్సీ మినిస్ట్రీస్ కార్యాలయంలో బ్రదర్ సునీల్‌దత్‌తో కలిసి ఆయన ఆశీర్వాద పండగ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సీ మినిస్ట్రీస్ వార్షికోత్సవ వేడుకను పురస్కరించుకుని ఈ నెల 12వతేదీ నుంచి ఐదు రోజుల పాటు ఆశీర్వాద పండుగ జరుపుతున్నట్లు తెలిపారు. రోజూ రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాలకు క్రైస్తవ సోదర, సోదరీమణులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పాల్‌కుమార్, రాజేష్, విజయ్, శామ్యూల్, విజయశేఖర్, సురేంద్రపాల్, థామస్, డేవిడ్ రాజ్, రాజ్ కుమార్, సిస్టర్ హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : అరవై సంవత్సరాలు నిండిన మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కోరారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వారు నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా నగరపాలక సంస్థలో సేవలందిస్తున్న కార్మికులను ఎలాంటి బెనిఫిట్లు ఇవ్వకుండా ఒట్టి చేతులతో ఇంటికి పంపడం సరైంది కాదన్నారు. వారికి రూ.10లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని, పింఛన్ రూ.10వేలు ఇచ్చి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసే కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.24500 వేతనం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 8వ తేది కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం వారు మేయర్ సురేష్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షుడు కె. తిరుపాలు, నగర అధ్యక్షుడు ఎస్. రవి, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీరాములు, నగర కమిటీ నాయకులు కిరణ్, ఆదాం, చెన్నయ్య, ప్రసాద్, ఆశి బాబు, హరి, ఆనంద్, నాగరాజు, కొండయ్య, సాయమ్మ, రమీజా పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మౌన దీక్ష



కలెక్టరేట్ వద్ద మౌన దీక్ష చేస్తున్న దళిత అభివృద్ధి సంక్షేమ సంఘం నాయకులు, నిరుపేదలు

కడప సెవెన్‌రోడ్స్ : సీకే దిన్నె మండలం ఆజాద్‌నగర్, శివసంధ్యనగర్, కృష్ణాపురంలో ఉంటున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట మౌన దీక్ష జరిగింది. ఆ సంఘం అధ్యక్షుడు శంకర్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీకే దిన్నె తహసీల్దార్ విచారణ నిర్వహించి అర్హులైన పేదలను గుర్తించారని పేర్కొన్నారు. వీరికి చెర్లోపల్లె లే అవుట్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్లను మంజూరు చేసి స్వంత ఇల్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఎన్నిమార్లు కోరినా సీకే దిన్నె తహసీల్దార్ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు వ్యవసాయ భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వైఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 35 వేలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, వివిధ సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ రంగ సంస్థలు, షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను రూ. 35 వేలకు పెంచాలని కోరుతూ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఏఐటీయూసీ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, అధ్యక్షులు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ 7 నుంచి 12 సంవత్సరాలుగా వేతనాలు సవరించలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, కరెంటు ఛార్జీలు, ఇంటి అద్దెలు మాత్రం పెరుగుతున్నాయన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కోసం కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా కార్యదర్శి లింగన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు నరసింహులు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీనరసమ్మ, ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు సులోచనమ్మ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సరోజ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు.

కార్మిక వర్గ ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్



కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రపంచ కార్మిక వర్గపు ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్ అని సీపీఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ కొనియాడారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో కార్ల్ మార్క్స్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్స్ జీవితంలో అనేక త్యాగాలు మనకు స్ఫూర్తిదాయకమని, ఆ త్యాగాల స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం సీపీఎం కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్ అన్వేష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, ఫణిరాజు, రసూల్, జార్జి, ప్రవీణ్ కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

■ ప్రపంచ గమనాన్ని మలుపు తిప్పిన యోధుడు కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కామ్రేడ్ కారల్ మార్క్స్ అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి తెలిపారు. సోమవారం మార్క్స్ జయంతి సందర్భంగా నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుండి, రాజీవ్ మార్గ్ వరకు మార్క్స్ చిత్రాల ప్రదర్శన ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, ఆర్సిపి నగర కార్యదర్శి మక్బూల్ బాష, సికిందర్, డబ్ల్యూ రాము, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, తస్లీమ్, లక్ష్మీదేవి, చాపల సుబ్బరాయుడు, రమేష్, బాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా యూనియన్ నాయకులు సోమవారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే దశల వారీగా పోరాటాలు, నిరాహార దీక్షలు చేపట్టామన్నారు.

ఈ కార్యక్రమంలో కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, ప్రెసిడెంట్ జయరాం, వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఖాన్, అసిస్టెంట్ సెక్రటరీలు జబ్బార్, రామచంద్ర, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఖాజా మైనుద్దీన్

కడప కార్పొరేషన్ : కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పరిశ్రమల యాజమాన్యాలు కృషి చేయాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మైనుద్దీన్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు తమహక్కుల కోసం న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చన్నారు. వేతనాల విషయంలో మహిళలు, పురుషులు అన్న తేడా లేదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ప్రమాదం కారణంగా పనిచేయలేకపోతే కుటుంబంలోని వారికి అర్హతలనుబట్టి ఉపాధి కల్పించాలన్నారు. ఇలాంటి విషయాలపై యాజమాన్యాలు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, న్యాయవాదులు జిలాన్, కరీముల్లా, పరిశ్రమల యజమానులు రమణారెడ్డి, మదన్‌కుమార్, అశోక్, ఎస్ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుద్దీపాల అలంకరణలో మోక్షనారాయణ స్వామి ఆలయం

కమలాపురం: మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన మహాలక్ష్మి సమేత మోక్షనారాయణ స్వామి, వల్లీ దేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు సత్యసాయినాథశర్మ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు శనివారం గణపతి పూజతో ప్రారంభం అవుతాయని, పుణ్య భూమి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరుకు చెందిన వేద ఘనాపాటి వంశీకృష్ణ ఆధ్వర్యంలో రామనపల్లె వెంకటేశ్వరశర్మ, శివరామశర్మ, మారుతీశర్మ, అన్నపురాజు జగదీష్ శర్మ, శ్రీధర్ శర్మ, కైప నాగేంద్రశర్మ నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఐదు రోజుల పాటు స్వామికి మాడ వీధుల గుండా వాహన సేవలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

14న బండ లాగుడు పోటీలు

మండలంలోని రామాపురంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న న్యూ కేటగిరీ వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుస బహుమతులుగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.5వేలు అందజేస్తామని తెలిపారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ సంగీత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.